# ఆరనిమంటలు

"పిల్లవాడికి పాలు కలపటానికి వేడినీళ్ళు తెస్తాను. ఫ్లాస్కు ఇలా ఇవ్వు" సోమసుందరం తన సీట్లోంచి లేచాడు.

చంద్రకాంత తలనిండా పూలుపెట్టుకుని, కొత్తచీరె కట్టుకుని పసుపురాచిన కాళ్ళతో పుట్టింటినుంచి పిల్లవాడిని ఎత్తుకుని వస్తోంది ఒంటరి కాపరానికి. బుట్టలో నుంచి ఫ్లాస్కు తీసియిస్తూ "ఒకసారి నీళ్ళతోకడిగి వేడినీళ్ళు పోయించుకురండి. ఇక్కడెంతసేపు బండి ఆగుతుందో ? వేగిరం రండి'' అన్నది.

అది ఖమ్మంమెట్టు స్టేషను. కొంతసేపు ఆగుతుంది రైలు. ప్రయాణీకులు కాఫీ టిఫిన్లకు రైలుదిగి క్యాంటిన్‌లో తీసుకుంటున్నారు. కొందరు పత్రికలు చూస్తున్నారు కొనకుండానే.

విజయవాడనుంచి సికిందరాబాదుకు వచ్చే గోలకొండలో పొద్దున్నే ఎక్కేరు. పిల్లవాడికి పాలవేళయింది. సన్నగా ఏడుపుసాగించాడు.

వేడినీళ్ళురాగానే పిల్లవాడిని సోమసుందరానికిచ్చి పాలుకలిపి బుడ్డిలో పోసింది. పిల్లవాడిని ఒళ్లోపడుకోబెట్టుకుని పాలుపట్టి నిద్రబుచ్చింది.

"మీరు ఇల్లు వసతిగా ఉండేటట్టు చూశారా ? పసిపిల్లవాడితో కాపురం. ఇబ్బంది పడకుండా చూడండి. పనిమనిషిని చూశారా ? కొంచెం ఎక్కువసేపు ఉండేట్టుగా మాట్లాడేరా ?" కొత్తకాపురాన్ని గురించి భయపడుతూ అడుగుతోంది చంద్రకాంత. వెంటవచ్చే పెద్దవాళ్లు ఎవరూలేక ఒంటరిగా పంపించారు తల్లి దండ్రులు.

''అన్నీ నేను చూసుకుంటాను. ఏం భయంలేదు. పిల్లవాడిని ఎత్తుకుంటాను. ఇంటిపనులలో నీకు సహాయం చేస్తాను. ఎక్కువసేపు బయట తిరగను. ఆఫీసునుంచి నేరుగా ఇంటికే వస్తాను. పగలంతా పనిమనిషి ఉంటుంది. ఇంత

కంటె ఇంకేంకావాలి ?'' అన్నాడు సోమసుందరం, తల్లడించిపోయే అత్తగారి ఎదుట చంద్రకాంతతో.

"మీరు చూసుకుంటారు. కాని, మాకే-ఒంటరికాపరం, చిన్నపిల్లవాడితోనని భయంగా ఉంది. అందుకని పదేపదే అన్నాము" అత్తమామలు అతడికి సర్దిచెబుతూ బండీ ఎక్కించారు.

నిద్రపోతున్న పిల్లవాడిని సోమసుందరానికిచ్చి సీసా కడగటానికి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళింది చంద్రకాంత. అక్కడ అప్పటికే పెద్దక్యూ ఏర్పడ్డది. తమవెనక చాలామంది నిలబడ్డారన్న ధ్యాసలేకుండా గ్లాసులు కడిగి పిల్లలచేతులు ముఖాలు, కడిగి నిదానంగా కదులుతున్నారు ప్రయాణీకులు. వాష్‌బేసిన్ దగ్గర నుండి చంద్రకాంత వాళ్ళను తోసుకువెళ్ళలేక విసుగ్గా నిలబడ్డది.

ఒక్కొక్కరు అక్కడినుంచి కదలగానే చంద్రకాంత గబగబా సీసా, చంచా గ్లాసు కడుక్కుని, పిల్లవాడూ భర్త ఉన్నచోటికి వచ్చేసరికి అందరూ సర్దుకుని కూర్చున్నారు.

చంద్రకాంత ఇటూఅటూ చూస్తూ నడుస్తున్నది.

రైలు కదలేముందు ఒక్క కుదుపు కుదిపింది.

ఆదుర్దాతో ఆమె ఇంకా ముందుకుపోయి చూసింది. ఆ కంపార్టుమెంటు ఆ చివరినుంచి ఈచివరివరకూ మరొకసారి తిరిగి చూసింది.

ఏడీ బిడ్డనెత్తుకున్న సోమసుందరం ?

ఏమయిపోయాడు ? ఈ కంపార్టుమెంటేగా తామెక్కింది ?

అంతలో జ్ఞాపకం వచ్చి ఒక చిన్నబుట్టపెట్టె సీటుకింద ఉన్నయేమోనని బెంచీపొడుగునా చూసింది. మళ్ళీ తను కూర్చున్నచోటికి వచ్చి ''ఏమండీ, పసిపిల్లవాడిని ఎత్తుకున్న ఆయన ఎటు వెళ్ళారు ? ప్రశ్నించింది తోటి ప్రయాణీకుడిని.

''ఏమోనమ్మా చూడలేదు" అన్నాడు ఆయన.

"పిల్లవాడితో ఒకాయన ఈసీటులో కూర్చున్నారు ఇందాక. ఎటువెళ్ళారో చూశారా ?'' పేపరుచదువుతున్న ఆయనను భయపడుతూ అడిగింది.

పేపరు మడుస్తూ చంద్రకాంత నొకసారి ఆపాదమస్తకమూ చూసి"నాకేం తెలియదు" అన్నాడు

"ఇప్పటి వరకూ పిల్లవాడిని బుజానవేసుకుని నిలబడే ఉన్నాడమ్మా. ఇంతలోకి పదిమంది తోసుకుంటూ లోపలికి పెట్టెలు పట్టుకొని వచ్చారు. అంత వరకూ నేను చూస్తునే ఉన్నాను" అన్నది ఒక నడీడు ఆడమనిషి.

చంద్రకాంతకు కళ్ళనీళ్లు కారిపోతున్నాయి. భయంతో ఒణికిపోతున్నది. అప్పటికే రైలు కదిలి వేగాన్ని పుంజుకుంటున్నది. ఆ కంపార్టుమెంటులో ఉన్న వాళ్ళంతా చూస్తున్నారు ఆమెను కుతూహలంగా.

ఆ రైల్లో కూర్చున్న ఒకరిద్దరు "రైలు కాజీపేటలోనే ఆగుతుంది. కాజీపేట పెద్ద జంక్షన్‌స్టేషను. అక్కడ వెతకటం చాలా కష్టం. గొలుసు లాగి రైలాపకపోతే ఈ అమ్మాయి ఇబ్బందిపడుతుంది" అన్నారు.

చంద్రకాంత స్థితి చాలా దయనీయంగా ఉంది. ఎదటివాళ్ళచేత కంటతడి బెట్టిస్తున్నది.

ఎవరు లాగాలి గొలుసు ?

ఎవరులాగితే ఏంతప్పో ? 'నీకేం ఇంట్రస్టు'అని ఎవరయినా అడిగితే ? సలహా ఇచ్చారుగాని ఒక్కరూ ముందుకు రాలేదు.

చంద్రకాంత తెగించి అందరిముఖాలు అదోలా చూస్తూ, గొలుసులాగింది ధైర్యం తెచ్చుకుని.

రైలాగిందే తడవుగా గుంపులు గుంపులుగా జనం దిగారు ఏమయిందో ననుకుంటూ.

రైల్వే అధికారి "గొలుసు ఎందుకులాగారు ? రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని మాకు చివాట్లు తగులుతున్నాయి. ఎవరు గొలుసులాగింది?"అరిచాడు.

ప్రయాణీకులంతా ప్రేక్షకుల మాదిరి ఆమెవంక చూస్తున్నారు.

"ఏమ్మా నీవేనా గొలుసులాగింది" కొట్టినట్టే అడిగారు అధికారులు.

"పసిపిల్లవాడినెత్తుకున్న తండ్రి కనబడలేదు. సామానుకూడాలేదు. అందు కని గొలుసులాగాను" అంది ఒణుకుతూ.

"బండి ఆగిందిగా ? కనబడ్డారా ?" హేళనగా అన్నాడొక గార్డు జండా పట్టుకుని.

''ఊఁ హూఁ. ఇక్కడ దిగిపోతాను. ముందుకుపోయి ఏంచేస్తాను ?'' అంటూ అందరినీ తోసుకుంటూ రైలుదిగింది.

రైలు కదిలిపోయింది.

ఆమె పాదాలు తడబడుతున్నాయి. కళ్లు ఉబ్బిపోయాయి. కాళ్ళకు చెప్పు లున్నా మండిపోతున్నట్టున్నాయి.

ఆమె పట్టాలవెంబడి ఎండలో నడిచి స్టేషను చేరుకుంది.

ఇప్పుడేం చెయ్యాలి తను ?

తిరిగి వెళ్ళిపోదామంటే చేతిలో డబ్బులేదు.

అసలింతకూ ఆయన పిల్లవాడినెత్తుకుని సామానుతో ఎటువెళ్లాడు ?

కళ్ళు తుడుచుకుంటూ ఆలోచిస్తూ తడపడే పాదాలతో అడుగులువేస్తూ ''నేను పాలసీసా కడగటానికి వెళ్ళినప్పుడే బుట్టచేతికి తగిలించుకుని పెట్టెపట్టు కుని దిగి ఉండాలి సోమసుందరం" అనుకుంది మనసులో.

''ఆ దిగటంలో అర్థమేమిటి ? తనను వదలిపెట్టి పిల్లవాడినీ సామానూ తీసుకుని వెళ్లాలనా ? ఎక్కడికి ? ఎక్కడికని టికెట్ కొన్నాడు ?"

బి.యస్సీ ప్యాసయిన తను టికెట్లు ఎక్కడికి కొన్నదీ చూడలేదు.

పసిపిల్లవాడికేం కావాలో నన్న ఆతురతతో ఒక్కొక్కటే జ్ఞాపకం చేసు కుంటూ పెట్టె సర్దుకుంది.

అయినా తనను తీసుకువెళ్లటానికి వచ్చింది మరెవరో కాదు తనను పెళ్ళి చేసుకున్న సోమసుందరం. పిల్లవాడు పుట్టిన తరువాతకూడా అతడి మాటలు నమ్మకుండా టికెట్లుచూస్తే ఏంబాగుంటుంది ?

అయినా అతడిని కాక ఇంకెవరిని నమ్ముతుంది ? పెళ్ళి అయిన తరువాత ఒకరినొకరు నమ్మాలికదా.

అయినా తమిద్దరిమధ్యా అభిప్రాయభేదాలు లేవు. అనుమానించటానికి. ఒక్కమాటయినా గట్టిగా మాట్లాడేవాడు కాదు. ముందుకుముందే- ''సినిమా కెళ్దామా ? అయితే నేను వచ్చేవరకూ సిద్ధంగాఉండు" అనేవాడు. ''టాంకుబండు మీదికి వెళ్దామా ?" "నేను బంగాళాదుంపలు ఒలుస్తాలే'' అని పొయ్యిదగ్గరికి వచ్చేవాడు.

"చూడు పొయ్యిదగ్గరికి ఎక్కువగా రాకు అబ్బాయి నల్లబడిపోతాడు'' అని నవ్వేవాడు.

చంద్రకాంత చూడ చక్కనిదేగాని రంగుతక్కువ.

"నా రంగురాదు. మీరంగే మీ పోలికేవస్తుందిలెండి" అనేది ముఖం దించుకుని.

''అందుకే కాబోలు ఒక కవి 'పార్వతీపతి తెల్పు' అన్నాడు తన సీస పద్యంలో గాని-పార్వతి నలుపని అనలేదు. ఆమెకు కోపంవస్తే ఇంకేమయినా ఉందా ? లోకాలన్నీ తలకిందులుకావూ ?'' అంటూ ముఖాన్ని రెండుచేతులతో పైకెత్తేవాడు అనునయంగా.

పురిటికి తండ్రివచ్చి తీసుకువెళ్తుతుంటే ''మీరు పెద్దవారు. నేను మీ వెంట వస్తానని" వచ్చి దింపి వెళ్ళాడు.

"మళ్ళీ ఎన్నాళ్ళకు వస్తావు ?" గేటువరకూ వెళ్ళినవాడు మళ్లీలోపలికి వచ్చి అడిగాడు. ఆమె తలలోపూలు వాసనచూస్తూ.

"ఇది సినెమానా మూడు గంటలు కాగానే ఇంటికి రావటానికి," చంద్ర కాంత విరగబడి నవ్వింది.

"చూడు నాయనా వచ్చి ఇరవైనాలుగుగంటలు కాలేదు. అప్పుడే ఎప్పుడు వస్తావని అడుగుతున్నావా ?" అన్నాడు మామగారు.

అత్తగారు చేతులు తుడుచుకుంటూ వంటఇంట్లోనుంచి వచ్చి" పురుడు కావాలి - పదిరోజులు గడవాలి. మాయింట్లో ఇరవైఒకటో రోజున గాని నామ

కరణం చెయ్యం. తల్లీ పిల్లా క్షేమంగా ఉంటే మూడవనెలకు పంపిస్తాము" అన్నది విసురుగా వచ్చి.

ఇంతలోకి బావమరిది వచ్చాడు. "ఏమిటోయ్ ? తిరుగుప్రయాణం అడావిడి చేస్తున్నావా అప్పుడే ?"

అందరూ నవ్వారు.

సిగ్గుపడుతూ వెళ్ళిపోయాడు.

వెళ్ళిన దగ్గర్నుంచీ ఒకటే ఉత్తరాలు కురిపించటం మొదలుపెట్టాడు. పిల్లవాడు పుట్టాడనగానే వెంటనే వచ్చి చూశాడు. పురిటి గదిలోనుంచి బయటికి రాడు. పిల్లవాడిని ఎత్తుకుంటానంటాడు.

అత్తగారు వచ్చి "నాయనా ! అస్తమానం పురుటింట్లోకి ఊరంతా తిరిగిన కాళ్ళతోటి వెళ్ళకూడదు" ఆపేసింది.

"అయితే పేరు పెట్టుకోవటానికి ఎప్పుడు రమ్మంటారు ?"

"మూడవనెల రాగానే మీ తల్లిదండ్రులను తీసుకురండి. అన్నిటికీ పెద్దవాళ్ళ ఆశీర్వచనం కావాలి'' ఖండితంగా చెప్పిందితల్లి.

నిమిషానికొక రోజుగా లెక్కపెట్టుకుంటూ మూడవనెల రాగానే వచ్చాడు.

"ఏం పేరు పెట్టాలని ? నాయనా ఒక్కడివే వచ్చావు ? నాన్నగారు అమ్మగారు రాలేదూ ?" అడిగింది అత్తగారు.

"నాన్న పెద్దవాడైపోయాడు. ఆయనను వదలిపెట్టి అమ్మరాలేదు. నన్నే వెళ్ళి పేరుపెట్టి తీసుకురమ్మన్నారు ''

"అలాగా. అయితే ఏంపేరు పెడతావు ?" అడిగాడు బావమరిది.

"మా తాతగారిపేరు వెంకట్రామ సుందరయ్య. ఆయనపేరు పెట్టితీరాలని మా అమ్మ చెప్పింది. కనుక ఆ పేరు పెట్టితీరాలి" అన్నాడు సోమసుందరం.

"వాడిపేరు గోపీకృష్ణ. నేనదే పెట్టాలనుకున్నాను. మరొకపేరు కలపటానికీ వీల్లేదు - పెట్టటానికి అంతకంటె వీల్లేదు'', ఖండితంగా నవ్వుతూనే చెప్పింది చంద్రకాంత.

చివర కామే గెలిచింది.

తాతగారు మనమడికి చేతులకు మురుగులు, మెడలోకి పులిగోరు పతకమూ మొలకు బంగారు గజ్జెలూ చేయించారు. కూతురికీ అల్లుడికీ కోరిన బట్టలు కొన్నారు. నామకరణం అతివైభవంగా చేశారు.

ఒక్క కూతురు, మనమడుపుట్టాడు. అపురూపంగా ఉంది వాళ్ళకు. రాకపోయినా అత్తమామలకుకూడా బట్టలు పెట్టి పంపించారు.

"అలా జరిగిన పెళ్ళి పురుడూ చివరకు ఇలా అంతమయ్యాయా ? ఇప్పుడేంగతి ? వట్టిచేతులతో తిరిగి పుట్టింటికిపోతే వాళ్ళు గొడవచేసి తిరుగు ప్రయాణం కట్టిస్తారు. కాని - ఎక్కడికి ?

అంతలో స్టేషనులో అలజడి ప్రారంభమయింది. కూలీలు సందడిచేస్తూ తిరుగుతున్నారు.

వెయిటింగ్ రూములో నుంచి బైటికివస్తూ "రైలొస్తోందా ? ఎటు పోతుంది'' అడిగింది.

"ఈ బండి గుంటూరు వెళ్ళేదండి" అన్నారెవరో.

అప్పుడు తోచింది చంద్రకాంతకు - తను గుంటూరువెళ్ళి అమెరికన్ హాస్పిటల్లో నర్సుగాఉన్న నీలామణి దగ్గరికి వెళ్ళి సలహా అడుగుదామని.

అయితే టికెట్ ? చేతిలో పదిపైసలులేవు.

దడదడలాడుతూ రైలు వచ్చింది. ఆగగానే ఆడవాళ్ల కంపార్టుమెంటు చూసుకుని ఒక మూలకు ఒదిగి కూర్చుంది.

మళ్లీ ఆలోచనలు.

'వెళ్ళగానే ఉత్తరం రాయమని అమ్మానాన్నా చెప్పారు. ఉత్తరానికి జవాబు రాకపోతే అన్నయ్యని పంపిస్తారు కాబోలు. ఎక్కడికని ?'

రైలు కదిలింది, ప్రయాణీకులు సామానుసర్దుకుని కూర్చున్నారు. కబుర్లు మొదలుపెట్టారు. ఆడవాళ్ళ కంపార్ట్‌మెంటాయెనుమరి. మధ్యలో పిల్లల ఏడుపులు. తల్లుల అరుపులు, చికాకుగా ఉంది.

టికెట్ చెకింగుకని కలెక్టరువస్తే ఏంచెయ్యాలి ?

గుంటూరు వెళ్ళేటప్పటికి బాగా చీకటిపడ్డది. రైలుదిగి అడ్డదారిన పడి నడుస్తూ "నీలామణి యిల్లు స్టేషన్‌కి దూరం. బండీమీద వెళ్ళటానికి డబ్బు లేదు". ఇల్లు తెలుసుకనుక వీధి దీపాల వెలుగులో - ఆకలి కడుపుతో - పిల్లవాడిమీది బెంగతో - నడిచివెళ్ళింది.

లీలామణి డ్యూటీ అయినట్టుంది. తన గదికివచ్చి స్నానంచేసి బట్టలు మార్చుకుని ఇంక భోజనం చెయ్యాలనుకుంటోంది. అంతలో తలుపు చప్పుడయింది.

"ఎవరబ్బా ఈ వేళప్పుడు ? రూమ్‌మేట్ ఊరికెళ్ళింది" అనుకుంటూ తలుపుతీసింది.

"నీవా చంద్రా ! ఎక్కడినుంచి వస్తున్నావు ?

చంద్రకు నోటినుంచి మాట బైటికి రాలేదు.

"నీకు పెళ్ళయిందనీ పిల్లవాడు పుట్టాడనీ విన్నాను. నీవైనా పెళ్ళిచేసుకుని బిడ్డలనుకని జీవితంలో స్థిరపడ్డావు. అన్నట్టు మీ అబ్బాయి ఏడి ?" బుజమ్మీద చేతులువేస్తూ లోపలికి తీసుకువెళ్ళింది.

"అన్ని సంగతూలూ చెబుతాను. నన్ను ఒక గంటసేపు మాట్లాడించకు. నాకు బట్టలులేవు - హాయిగా స్నానం చేద్దామంటే."

"నేనిస్తాలే" అంటూ బట్టలు తెచ్చియిచ్చింది. ఆమె స్నానంచేసి బయటికి రాగానే ఇద్దరు ఉన్నదేదో సర్దుకుని భోజనంచేశారు. గదిలో పక్కమీద కూర్చుని "ఇంకచెప్పు నీసంగతి ? నీ ముఖంచూస్తే ఏదో భయంకరమైన విపత్తులో చిక్కుకున్నట్లున్నావు. పలకరిస్తే కన్నీళ్ళొస్తున్నాయి" చంద్రపక్కన ఉన్న బట్టలుతీసి పక్కకుపెట్టి, ఆమె వెన్నుమీద చెయ్యివేసి రాస్తూ "ఈవేళప్పుడు వచ్చావు - అదీ ఒంటరిగా, నిన్నుచూడగానే గుర్తుపట్టలేదు. నల్లబడ్డావు. తలవెంట్రుకలు ఊడిపోయాయి. నీవు చిన్నప్పుడు ఎంతగారాబంగా పెరిగావే ? అలిసిపోయినట్లున్నావు. పడుకుంటావాపోనీ ? " అన్నది.

"పడుకోలేను కడుపులో మంటను నీకు చెప్పి కొంత చల్లార్చుకోనీ. ఇప్పుడు నా బ్రతుకంతా నీ దయమీద ఆధారపడి ఉంది. అమ్మా నాన్నా

అన్నయ్య ఉంది నేను దిక్కులేని దానన్నయ్యాను'' అని జరిగినదంతా పెళ్ళి దగ్గర్నుంచి తానక్కడికి వచ్చేవరకూ చెప్పింది.

అంతా విన్నతరువాత ఒకరికన్నీళ్ళొకరు తుడుచుకున్నారు.

''చంద్రా ! ఎంతటి విషాదగాథ చెప్పావే ?"

''వాడెక్కడున్నాడో వెతికి కాల్చిపారెయ్యాలనిపిస్తోంది. నేను రెండు రోజులు సెలవుపెట్టి హాస్పిటల్ సూపర్నెంటూను కలుసుకుని నీ సంగతంతా చెప్తాను. కొన్ని నాన్‌టెక్నికల్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు అనుకోగా విన్నాను. చంద్రా నీకు కాకపోతే ఎవరికి చేస్తాను సహాయం ? నీ భోజనంలో నాకుసగం పెట్టి నన్ను పెంచావు. కొత్తబట్టలిచ్చేదానివి. నిన్ను ఈ స్థితిలో వదిలిపెడ తానా ? నాకు చేతనైనంత సహాయం చేసి నాప్రాణస్నేహితురాలిని దక్కించు కుంటాను." కొంగుతో ముఖంతుడుచుకుంది.

"అంతతియ్యటి మాటలతో నన్ను మోసగించి ఆయన అట్లా పారిపోవ టమే నాకాశ్చర్యంగా ఉంది. పెళ్ళిచేసుకున్నది పిల్లవాడికోసమా ? నాకు అంతు పట్టక అపుకుందామన్నా ఆగటంలేదే ఈ దుఃఖం. నాకడుపుమంట చల్లారేదెట్లా ? ఇటువంటి కేసులెప్పుడైనా విన్నావా ?'' చంద్ర వెక్కిళ్ళమధ్య అన్నది.

"నర్సునయిన తరువాత ఇటువంటి చరిత్రలు అనేకంగా విన్నాను. ఆడ వాళ్ళవేకాదు మగవాళ్ళవికూడా. జీవితాలెట్లా మలుపులు తిరుగుతాయో మనకు తెలియదు. పాతికేళ్ళనాడు వాతలుపెట్టి భార్యను రోడ్డుమీద పారేసిన భర్త,నర్సుగా ఇక్కడ పనిచేస్తున్న భార్యను, రోగిగా హాస్పిటల్లోచేరి, ఆమెను గుర్తించి "ఈస్టూలుమీద ఇక్కడే కూర్చుని కబుర్లు చెబుతూ ఉండరాదూ?" అంటాడు. ఆమెకు భయంపుట్టి ఆ వార్డునుంచి మరో వార్డుకు బదిలీ చేయించుకుంది ఒక నర్సు. భర్త సంపాదించినదంతా మగ స్నేహితులమీద క్లబ్బులమీద ఖర్చుచేసి అతడికి అన్నమైనా పెట్టకుండా వీధిలోకి నెట్టిన భార్యలున్నారు. ఆ భర్తలు జబ్బు నయమైనా ఇంటికి పోతామనరు. ఈలోకంలో ఎన్నిరకాల మనుష్యులు ఉన్నారో నాకు కొంత కొంత తెలుస్తోంది. ప్రపంచమంతా స్వార్థంమీద ఆధారపడి ఉందంటారు కొందరు. భార్యను ప్రేమించటంలో స్వార్థంలేదా? బిడ్డలను పెంచటంలో స్వార్థం లేదా? తమకు అవసానదశలో అక్కరకు వస్తారని బిడ్డలమీద పెట్టుబడి పెట్టటం తల్లిదండ్రుల స్వార్థంకాదా? కాని - నిస్వార్థంగా పెంచుకున్న మమతలుకూడా

ఉన్నాయి. ఈ ప్రపంచమే ఒక ఇంద్రధనుస్సు లాంటిది. 'నక్కపుట్టి వారం రోజులు కాలేదుగాని. ఇంతగాలివాన నేనెర్రుగనన్నదట? మనకు ఏంతెలుసు లోకాన్ని గురించి' అలిసిపోయిన చంద్ర కళ్లమ్మూతలు పడటంచూసి తనూ ఆమె పక్కన పడుకుంది లీలామణి.

అన్నట్టుగానే హాస్పిటల్ సూపర్నెంటు పెథాలజీ డిపార్టుమెంటులో టెక్నీషియన్‌గా, ఆరునెలలు శిక్షణతో ఉద్యోగమిచ్చాడు చంద్రకాంతకు.

లీలామణి చంద్ర తనగదిలోనే ఉండేఏర్పాటు చేసింది.

కాలం ఇవన్నీకంటితో చూస్తూ గిర్రున తిరుగుతున్నది.

ఆ హాస్పిటల్ ఆవరణం చాలా పెద్దది. బ్రిటీషువారి కాలంలో అమెరికన్లు హాస్పిటల్ కడతామంటే వెంటనే ఐదు ఎకరాల భూమిని ఇచ్చారు. అమెరికన్లు స్కూళ్ళు పెడతామంటే కొన్ని ఊళ్ళల్లో భవనాలు కూడా కట్టించిఇచ్చారు. అక్కడ పేదవారికి ఉచిత విద్యాసౌకర్యాలు ఉన్నాయి. వసతిగృహాలు ఉన్నాయి. అందుకే గ్రామాలలోని పేద ప్రజానీకం తిండి బట్ట చదువు ఉచితంగా లభిస్తుందని చాలామంది వాటిల్లో చేర్పించారు పిల్లలను.

ఈ పిల్లలు చదువుకుని శిక్షణపొంది ఆ సంస్థలలోనే ఉద్యోగాలు చేసేవారు. అలా ఆమతం గ్రామాలలో అభివృద్ధి చెందింది.

ఆ ఆవరణంలోనే నర్సులకు శిక్షణయిచ్చే భవనంకూడా ఉంది.

పెథాలజీ డిపార్టుమెంటునుంచి క్వార్టర్సుకు వెళ్ళటానికి బయలుదేరింది చంద్రకాంత. తలవంచుకుని నడుస్తున్నది.

"ఆగండి" ఎవరో వెనకనుంచి అరిచారు.

చప్పున వెనక్కుతిరిగింది. ఎవరో పరుగెత్తుకుంటూ వస్తున్నారు.

విభ్రాంతితో చూస్తూ నిలబడ్డది.

దగ్గరికివచ్చి ఆమె ముఖంలోకిచూస్తూ "ఇక్కడ చంద్రకాంత అనే ఆమె ఉద్యోగంచేస్తున్నదా ?" ఆయాసపడుతూ అడిగాడు.

దాదాపు ఇరవై ఏళ్ల సంగతి. ఆడవాళ్ళు త్వరగా మారిపోతారు. బాగా

చూస్తే పోలికలు కనబడుతున్నాయి. కాని-అతడు పొరబడ్డానేమోనన్న సందేహంతో అడిగాడు.

అతడు దగ్గరికిరాగానే 'అన్నయ్యా' అంటూ చెయ్యిపట్టుకుంది చంద్రకాంత సంభ్రమంతో.

"నీవా చంద్రా? నీవేనన్న అనుమానం నాకూవచ్చింది కాని పిలవటానికి సందేహించాను. ఎంతమారిపోయావు? ఇక్కడికి ఎట్లా చేరుకున్నావు?" ఆనంద బాష్పాలతో అడిగాడు. ఆమెకోసం వెతికిన ఊరేగాని వెతకని ఊరులేదు. ఆమెను గుర్తించగానే మనసు ఆగలేదు. సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

''అన్నయ్యా, క్వార్టర్సుకు వెళ్ళి మాట్లాడుకుందాం రా" అంటూ తీసుకువెళ్ళింది.

"ముందు భోజనంచెయ్యి తరువాత మాట్లాడుకుందాం''

''నేను భోజనంచేసి వచ్చానమ్మా" కుర్చీలో కూర్చున్నాడు. చల్లటి మంచినీళ్ల గ్లాసెడు తాగి-"చెప్పమ్మా ఏమిటి సంగతి? ఇక్కడికి ఎలావచ్చావు? ఇక్కడేం చేస్తున్నావు?'' అడిగాడు.

''ముందీసంగతి చెప్పు? నాన్నా అమ్మా బాగున్నారా?"

"ఆఁ. బాగానే ఉన్నారు. ఒకరు మంచంలో ఉన్నారు. ఒకరు ఏడ్చిఏడ్చి దాటిపోయారు''

''ఎవరు? అమ్మా? నాన్నా?''

''నాన్న'' ఈమాట అనేటప్పుడు అతడికి కళ్ళనిండా నీళ్ళునిల్చాయి.

"అయ్యో. నాన్నలేడా? ఈ దురదృష్టవంతురాలికోసం ఏడ్చి ఏడ్చి దాటిపోయాడా?'' కుమిలి కుమిలి ఏడ్చింది.

''ఇప్పుడెందుకు ఏడుస్తావు? పదేళ్ళు దాటింది''

కళ్లు తుడుచుకుని పిల్లవాడితో రైలెక్కినప్పటినుంచీ జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పింది.

"మీకెప్పుడు తెలిసిందీసంగతి?" గద్గదస్వరంతో అడిగింది.

''ఎన్ని ఉత్తరాలురాసినా జవాబు రాలేదు. సెలవుపెట్టి బయలుదేరాను

నాన్నా అమ్మల బాధచూడలేక. మీ అత్తవారిఊరు వెళ్ళాను. ఆ ఊళ్లోలేరనీ గుడివాడలో ఇల్లుకట్టుకుని ఉంటున్నారనీ ఇరుగుపొరుగులు చెప్పారు. అక్కడికి వెళ్ళాను. 'మా అబ్బాయి విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్నా'డన్నారు. అక్కడికి వెళ్ళి ఊరంతా తిరిగాను. చిన్న పెద్దా హోటళ్లు చూశాను. ఆఫీసులన్నీ తిరిగాను. అటువంటి పేరుగలవాడు ఆఫీసుల్లో కాలేజీలలో స్కూళ్ళల్లో ఎక్కడా ఉద్యోగం చేయటంలేదని తెలిసింది. పిచ్చెక్కినట్టయి ఒకనాడు బీచ్‌కి వెళ్ళి కూర్చున్నా ఆలోచిస్తూ. అక్కడ ఒకాయన కాలేజీలో పనిచేస్తాట్ట. ప్రతిరోజూ వచ్చే అలవాటుచొప్పున వచ్చాడు. కడుపులోని బాధను అణుచుకుందామని ఆయనను కబుర్లలోకి దింపి అంతా చెప్పాను.''

"అతడిపేరు ? ఎలాఉంటాడు ?'' అడిగాడు.

నేను చెప్పాను.

"వాడా ? ఆ సోమసుందరం ? ఇప్పుడు పిచ్చివాడయి రోడ్లమీద తిరుగుతున్నాడు. అప్పుడప్పుడు నా దగ్గరకొస్తాడు. ఈ సాయంత్రం రావచ్చు. నాతో వస్తారా ? మాయిల్లిక్కడికి దగ్గరే. మహారాణిపేట." అంటూ తీసుకువెళ్లాడు. అప్పటికే అతడు వచ్చివెళ్ళాడనీ పిల్లవాడిని గురించి అడిగినవాళ్ళకు ఈ వస్తువులివ్వమనీ చేతి మురుగులు, మొలగజ్జెలు పులిగోరు పతకంగల గొలుసు బట్టలో మూటగట్టి ఇచ్చాడనీ' అతడి భార్య తెచ్చియిచ్చింది.

ఇదిగో మూట. తీసుకోండి. అన్నట్టు మీపేరు శేఖరంగారేనా ? మీది విజయవాడ కదూ ?"

"మీకెలా తెలుసు ?'' ఆశ్చర్యంతో అడిగాడు.

''అతడే చెప్పాడు. దేశమంతా తిరిగితిరిగి ఇక్కడికి వస్తాడు. ఆయనకివ్వండి'' అంటూ ఉండేవాడు. ఇవాళ బుద్ధిపుట్టింది కాబోలు ఇవ్వటానికి'' అన్నాడు.

"అతడు ఊరికి వెళ్ళిపోతానన్నాడండీ'' అన్నది భార్య. "మీకిదివరకే పరిచయమా ?''

''మా కాలేజీలో ఒక టైపిస్టు. మాదగ్గరుండగానే పెళ్ళయింది. భార్యతో కాపరం పెట్టాడు. నేనాఅమ్మాయిని కూడా చూశాను. పురిటికి పుట్టింటికి పంపించా

నని ఒకనాడువచ్చి చెప్పాడు. తీసుకురావటానికి వెళ్తున్నానని తరువాతెప్పుడో చెప్పాడు. "కొడుకుపుడితే ముఖమట్లాఉందేమ"ని అడిగితే మాట్లాడకుండా వెళ్ళి పోయాడు"

"మిమ్మల్ని మళ్లీ కలిశాడా ? పిల్లవాడిని తీసుకువచ్చినట్టు చెప్పాడా ? చూపించాడా ?'' ఆత్రంతో అడిగాడు శేఖరం.

"మళ్లీ కలవలేదండీ. ఇటీవలే పిచ్చివాడిలా తిరుగుతూ కనబడ్డాడు."

"మీరు నిజంచెప్పండి. ఇది జరిగి ఇరవైఏళ్ళుపైన అయింది. మీకంతా తెలుసని నాకేందుకో అనిపిస్తున్నది. దయఉంచి చెప్పండి. జరిగినదానికి ఇప్పు డెవరూ చేసేదిలేదు'' శేఖరం ఆయన చేతులు పట్టుకున్నాడు.

ఆయన శేఖరం ముఖం బాగా పరకాయించి చూశాడు. తీవ్రమయిన మనో వేదనతో ఉన్నట్టు కనబడ్డాడు.

"ధైర్యంగా ఉండండి. సోమసుందరం కాలేజి చదువుకు ఒక జమీందారిణి డబ్బుయిచ్చింది. పెళ్ళిచేసుకుని పుట్టినపిల్లవాడిని తనకిచ్చేస్తే పాతికవేలిస్తానంది. సోమసుందరం ఇక్కడే బి.ఏ చదివాడు. పెళ్ళిచేసుకున్నాడు. ఆ జమీందారిణి అదృష్టంవల్ల కొడుకుపుట్టాడు. ఆమె ఎక్కడోకాదు-ఈ ఊర్లోనే ఉండేది. ఎందరికో ఆశపెట్టింది. చివరకు సోమసుందరం ఆమె వలలోపడ్డాడు. ఆమె వితంతువు. యావదాస్తినీ అమ్మి పిల్లవాడు చేతిలోకిరాగానే మద్రాసువెళ్ళి వీసా ఏర్పాటు చేసుకుని విదేశాలకు వెళ్ళిపోయింది. సోమసుందరం ఆమె వెళ్ళిపోతుందనుకోలేదు. ఆమె యిచ్చిన డబ్బు తల్లిదండ్రులకిచ్చివచ్చాడు. ఏదో పోగొట్టుకున్నట్టుండేవాడు. చివరకు పిచ్చివాడయిపోయాడు'' శేఖరం బుజమ్మీద చెయ్యివేశాడు.

"ద్రోహి, నా చెల్లెలికి ద్రోహం తలపెట్టినవాడికి పిచ్చిఎక్కకుండా ఉంటుందా ? అది అమాయకురాలు. కాని ఆత్మగౌరవం కలది. అప్పటినుంచీ అది ఇంటికి తిరిగిరాలేదు. ఆ పిచ్చివాడు నన్నుచూసేఉంటాడు. గుర్తించి ఇవాళే ఈ వస్తువులు మీకిచ్చి నాకందచేయమన్నాడు. నా తండ్రి ఈ దిగులుతోనే చని పోయాడు. తల్లి మంచంలో ఉంది. నా చెల్లెలు దేశాలుపట్టిపోయిందో-కృష్ణానదిలో పడ్డదో ?'' ఎర్రబడ్డకళ్లతో ఆ మూటపట్టుకుని లేచాడు.

"జరిగినదానికి మీరు బాధ్యులుకాదు. బాధపడకండి" అంటూ గేటువరకూ సాగనంపాడు ఆయన.

శేఖరం ఇదంతా తలవాల్చుకుని చెల్లెలికిచెప్పి ఆ మూట చేతికిచ్చాడు.

మూట విప్పిచూసుకుని బావురుమంది చంద్రకాంత.

"అన్నయ్యా. ఇవేనా నాకు మిగిలింది ?" దొర్లిదొర్లి ఏడ్చింది.

అంతలో లీలామణివచ్చింది. సంగతంతా విని చంద్రా ! అమ్మను చూసి వద్దాంలే. బస్సులో వెళ్ళితే తొందరగా చేరుకుంటాము. నీవు తయారుగా. నేను ఒక ఉత్తరం ఆఫీసులో పడేసివస్తానని వెళ్ళింది.

ముగ్గురూ ఇల్లుచేరేవరకూ తల్లిని భూశయనం చేశారు.

తనబిడ్డకోసం ఏడ్చిఏడ్చి అలిసిపోయిన చంద్రకాంత 'తమ కన్నబిడ్డ అలా అయ్యాడు. తనను కన్నతల్లి ఇలా అయింద'ను కుంటూ విరుచుకు పడి పోయింది.

కొంతసేపటికి లేచి పకపకా నవ్వుతూ "చూశారా మా అబ్బాయినగలు ? ఇవి పెట్టుకుంటే సరిగ్గా గోపీకృష్ణలాగే ఉండేవాడు. ఎంతబాగుండేవాడని ? దిష్టి తగులుతుంది. ఒదినా ఉప్పూ మిరపకాయలు తీసుకురా అనేది. మళ్ళీ అంతలోనే "బాబూ! ఎక్కడున్నావురా నాయనా" అంటూ భోరున ఏడ్చేది.

"చేసుకున్నవాడూ. కన్నవాడు కనబడకుండాపోయార''ని మనసులో కుమిలిపోతూ ఉద్యోగం చేసుకుంటున్నదాన్ని ఇక్కడికెందుకు తీసుకొచ్చాను ? నీలామణి చంద్రను దగ్గరికి తీసుకుని కన్నీళ్ళు తుడిచింది. కాని తనతో తీసుకు వెళ్ళలేకపోయింది.

❋❋